@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | ఆదివారం 14, ఏప్రిల్ 2024 | పేజిలు: 04


## ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై

# హత్యాయత్నం



### అపూర్వ యాత్రలో అలజడి.. విజయవాడలోని సింగ్‌నగర్‌లో జగన్ టార్గెట్‌గా దుశ్చర్య

- పథకం ప్రకారం స్కూల్ రెండో అంతస్తు పైనుంచి దాడి.. కనుబొమపై తీవ్ర గాయం
- ప్రథమ చికిత్స అనంతరం గాయంతోనే యాత్ర కొనసాగింపు
- షెడ్యూలు ప్రకారం రాత్రి 10.38 వరకూ సాగి.. ముగిసిన యాత్ర
- అనంతరం నేరుగా ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి
- లోకల్ అనస్తీషియా ఇచ్చి... కుట్లు వేసిన వైద్యులు
- విశ్రాంతి తీసుకోవాలని సూచన..
- నేడు యాత్రకు విరామం
- దాడిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మిన్నంటిన వైసీపీ శ్రేణుల నిరసనలు
- దాడిని తీవ్రంగా ఖండించిన తమిళనాడు, బెంగాల్ సీఎంలు స్టాలిన్, మమత
- త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్ష





**నేటి ఫోకస్ న్యూస్, విజయవాడ-ఏప్రిల్ 13:**

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఒక ఆగంతకుడు హత్యాయత్నానికి తెగబడ్డాడు. యాత్రలో భాగంగా శనివారం రాత్రి 8.10 గంటలకు సీఎం వైఎస్ జగన్ విజయవాడ సింగ్ నగర్ డాబా కొట్ల సెంటర్‌కు చేరుకోగానే హత్యకు ప్రయత్నించాడు. సీఎం జగన్ కణతకు గురి చూసి పదునైన వస్తువుతో దాడి చేశాడు. అయితే ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగన్ పక్కకు తిరగడంతో ఆయన ఎడమ కంటి కనుబొమపై భాగాన బలమైన గాయమైంది. దీంతో సీఎం పక్కకు తూలి.. ఎడమ కంటిని బలంగా అదిమి పట్టుకున్నారు. ఆయన ఎడమ మిగతా 2లో..

### జగన్ అన్నా జాగ్రత్త: కేటీఆర్

కాగా, సీఎం జగన్‌పై దాడి ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావు స్పందించారు. ట్విట్టర్ వేదికగా కేటీఆర్..'జగన్ అన్నా జాగ్రత్తలు తీసుకోండి. మీరు సురక్షితంగా ఉన్నారు సంతోషం. సీఎం జగన్‌పై జరిగిన దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు. ఎన్నికల సంఘం ద్వారా కఠినమైన చర్యలు చేపట్టాలని నేను ఆశిస్తున్నాను' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.



### రాజకీయ విభేదాలు ఎప్పుడూ హింసాత్మకంగా మారకూడదు: ఎంకే.స్టాలిన్ (తమిళనాడు సీఎం)

తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ సైతం జగన్‌పై దాడిని ఖండించారు. రాజకీయ విభేదాలు ఎప్పుడూ హింసాత్మకంగా మారకూడదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నప్పుడు సభ్యత, పరస్పర గౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు.



### దాడి హేయమైన చర్య: హరీష్ రావు

మరోవైపు హరీష్ రావు ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ..'సీఎం జగన్‌పై దాడి హేయమైన చర్య. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు' అని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. జగన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రజలపక్షాన ఆయుధమై

# ప్రభుత్వంపై పోరాటం

### కాంగ్రెస్ అసమర్థ పాలనలో కరెంటు కోతలు మొదలయ్యాయి

- ఆడబిడ్డలకు స్కూటీలు లేవు కానీ రాష్ట్రంలో లూటీలు మొదలయ్యాయి
- దళితబంధు పథకాన్ని పక్కన పెట్టారంటూ కాంగ్రెస్‌కు చురకలు
- కేంద్రంలోని పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు
- చేవెళ్ల బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మాజీ సీఎం కేసీఆర్





**నేటి ఫోకస్ న్యూస్, రంగారెడ్డి-ఏప్రిల్ 13:**


రాష్ట్ర ప్రజల పక్షాన ఆయుధమై కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుతామని.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా ప్రజలకు అండగా నిలుస్తామని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. ప్రభుత్వం మెడలు వంచాలన్నా.. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరగాలన్నా.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అప్పుడే ప్రభుత్వం దిగొస్తుందని.. హామీలను నెరవేరుస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం చేవెళ్లలో నిర్వహించిన తొలి ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. "అంబేద్కర్, జ్యోతి బాపూలే స్ఫూర్తితో పదిహేనేళ్లపాటు పోరాడి సాధించుకున్న మిగతా 2లో..

## సీఎం జగన్‌పై పచ్చ గూండాల దాడి

# పిరికిపంద చర్య

- జగన్ మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ప్రతిపక్షాల కుట్ర
- దాడి చేయించిన చంద్రబాబు-పవన్ కళ్యాణ్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు
- మే 13న జరిగే ఎన్నికలలో ప్రతిపక్షాలకు జగన్ అభిమానుల సత్తా ఏంటో చూపిస్తాం..
- మహంకాళీ అరుణ్ (జగన్మోహన్ రెడ్డి వీరాభిమాని, తెలంగాణ)





**ఫోకస్ న్యూస్, హైదరాబాద్- ఏప్రిల్ 13:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ రెడ్డిపై పచ్చ గుండాలు దాడి చేయడం పిరికిపంద చర్య అని, తెలంగాణ రాష్ట్ర వై.యస్ జగన్మోహన్ రెడ్డి వీరాభిమని మహంకాళి అరుణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విజయవాడలోని వై.యస్ జగన్మోహన్ రెడ్డి పై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మేమంతా సిద్ధం యాత్రకు వస్తున్న అపూర్వ ప్రజాదరణ చూసి ఓర్వలేక టిడిపి పచ్చముకలు, జనసేన నాయకులు ఇలాంటి దాడులు చేయడం పిరికిపంద చర్య అని అన్నారు. ఇలాంటి దాడులకు భయపడమని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లను పరోక్షంగా హెచ్చరించారు. చంద్రబాబు నీచూడని తెలుసు కానీ, మరి ఇంత మిగతా 2లో..



## కేటీఆర్, కేసీఆర్‌లకు ఇంకా బుద్ధి రావట్లేదు

- కేటీఆర్ దురహంకారీ, ఆడవాళ్ళు అంటే గౌరవం లేదు
- కేటీఆర్‌పై ధ్వజమెత్తిన మంత్రి సీతక్క

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్13:**

కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ డమ్మీ క్యాండిడేట్ అని కేటీఆర్ దురహంకారంతో మాట్లాడుతున్నారని మంత్రి సీతక్క కేటీఆర్‌పై ధ్వజమెత్తారు. కేటీఆర్ దురహంకారీ, ఆడవాళ్ళు అంటే గౌరవం లేదని, బొజ్జు, మిగతా 2లో..


నిత్య నూతనంగా వెలువడుతూ..

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.

9848488596
FOCUS TV TELUGU


## ప్రజలను ఆదుకోవడంలో

# కాంగ్రెస్-బీజేపీ విఫలం

- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్
- రుణమాఫీ, 500 బోనస్ ఏమయ్యింది
- ఎన్నికల ప్రచారంలో నిలదీసిన హరీష్ రావు

**నేటి ఫోకస్ న్యూస్, మెదక్-ఏప్రిల్13:**

ప్రజలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని, అలాంటి పార్టీలను లోకసభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దౌల్తాబాద్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ యువత సమావేశంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పీ వెంకట్రామరెడ్డితో కలిసి పాల్గొన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న మిగతా 2లో..



# కేటీఆర్, కేసీఆర్‌లకు ఇంకా బుద్ధి రావట్లేదు

(మొదటి పేజీ తరువాయి..)

సుగుణ లాంటి అనామకులే ఈ రోజు మిమ్మలిని ఓడించారన్నారు. తెలంగాణ ప్రజల త్యాగాల మీద నీకు పదవులు వచ్చాయని, కేటీఆర్, కేసిఆర్ కు ఇంకా బుద్ధి రావడం లేదన్నారు మంత్రి సీతక్క. కేటీఆర్ నీకన్న సుగుణ ఎంతో గొప్ప అని, నోరు జారకు కేటీఆర్ డబ్బు లేనోళ్ళు అనామకులా? అని ఆమె అన్నారు. నీలాగా దోచుకున్న డబ్బు మా దగ్గర లేదని, మీ లెక్క ఫోన్ ట్యాపింగ్ లు చేయాలే అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ అనుభవం లేనోళ్లు రాజకీయం లో రాకూడదా??ఇంత అహంకారమా మీకు?? ప్రాణ త్యాగాలు చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ. వాళ్ళేమో ఉన్నోళ్ల పక్షాన ఉన్నారు ..పేదల పక్షాన రాహుల్ గాంధీ ఉన్నారు. 10ఏళ్లుగా బిజెపి ఎం ఇచ్చింది? గుడి గురించి చర్చ చేసే బిజెపి బడులకు ఏం ఇచ్చింది. వందల ఏండ్ల నుండి మతాలు ఉన్నాయి కానీ మతతత్వం లేదన్నారు మంత్రి సీతక్క. అంతేకాకుండా..'అభివృద్ధి అడిగితే అక్షింతలు పంపడం కాదు, అభివృద్ధి చేసి చూపించండి. ఎన్నో చట్టాలు చేసింది కాంగ్రెస్ ,మరి బీజేపీ ఏం చేసింది. బొగ్గు బావులు అంబానీ ఆదాని లకు ఇచ్చే ఆలోచన చేస్తుంది బీజేపీ. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పార్టీ కాదు త్యాగాల పార్టీ. దేశం కోసం 11ఏండ్లు జైల్లో గడిపిన మనిషి కాంగ్రెస్ పార్టీ మనిషి. బీజేపీ పార్టీకి జంతువుల మీద ఉన్న ప్రేమ అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసులపైన లేదు. కేంద్రం జీఎస్టీ పేరుతో దోపిడీ చేస్తుంది.' అని మంత్రి సీతక్క అన్నారు.




# అంబేద్కర్ లేకుంటే.. ఏమైపోయే వాళ్ళమో

- జాతి ప్రజల కోసం తన బిడ్డలను త్యాగం చేసిన గొప్ప త్యాగశీలి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్
- ఆ మహనీయునికి 133వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు

ఫోకస్ న్యూస్, హైదరాబాద్:

భారతరత్న భీమ్ రావు అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా, ఆ మహనీయుని స్మరించుకుంటూ, ఒక శతాబ్దం క్రితం కుల నిర్మూలనకు, అశ్రుశతకు, భారత రాజ్యాంగాన్ని రాయడంలోనూ ఎంత వివక్షతకు గురయ్యాడో, ఆ మహనీయుడు చేసిన త్యాగం పోరాటం చిరస్మరణయం. తను ఎంతో ధనం వద్దనుకున్నాడు, సుఖం వద్దనుకున్నాడు, ఆస్తులు వద్దనుకున్నాడు, అంతస్తులు వద్దనుకున్నాడు, తన కన్న బిడ్డల భవిష్యత్తు కూడా చూసుకోలేదు. తన బిడ్డల భవిష్యత్తు చూసుకుంటే దేశ ప్రజల భవిష్యత్తు నాశనం అవుతుందని, ఒక దృఢ సంకల్పంతో ఉన్నత చదువులు చదవడంలో నిమగ్నమయ్యారు. భావి తరాల తన జాతి బిడ్డలందరి భవిష్యత్తు ముఖ్యమనుకున్నాడు. తను కట్టుకున్న భార్య సుఖం లెక్క చెయ్యలేదు. కోట్లాది దళిత బహుజన స్త్రీల సుఖమే కోరుకున్నాడు. కుల లింగ బేధం లేకుండా 18 సంవత్సరాలు అయిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిన గొప్ప పోరాట యోధుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. తన జన్మ తన జాతికి అంకితం అనుకున్నాడు. ఎన్నో అవమానాలు, మరెన్నో చీత్కారాలు, ఎన్నో అవహేళనలు ఇంకెన్నో బెదిరింపులు. ఎన్నో ప్రలోభాలు పెట్టిన కూడా అన్నిటిని ఎదిరించి అనుకున్న లక్ష్యాన్ని సాధించి భారత రాజ్యాంగాన్ని రచించాడు అంబేద్కరుడు... ఒక పక్క తన చుట్టూ ఉన్న కుల రక్కసి, ఇంకో పక్క తన ఒంట్లో ఉన్న మధుమేహ మహమ్మారి, ఒక వైపు సమాజం సహకరించలేదు, ఇంకో వైపు తన శరీరం సహకరించలేదు, అయినా అదరలేదు, బెదరలేదు...లొంగలేదు, ఒకటే లక్ష్యం. తన జాతి బాగుపడాలని ఒకటే గమ్యం. తన జాతి పైకి రావాలని అకుంటిత దీక్ష. మనుష్యులంతా ఒక్కటే అవ్వాలని అనితర సాధ్యమైన శ్రమ. అది తన ద్వారా సాధ్యం చెయ్యాలని ఎన్నో వేల సంవత్సరాలు కంటికి నిద్రలేని రాత్రులను గడిపాడు. వెరసి, అసాధ్యాల ను, సుసాధ్యాలుగా చేసి చూపించి, కోట్లాది దళిత, బడుగుల చీకటి జీవితాలలో వెలుగులు నింపిన సూర్యుడు భీమ్ రావు అంబేద్కరుడు. ఎప్పుడూ దండాలు పెట్టడమే తెలిసిన దళిత బడుగు బలహీన వర్గాలను, దండాలు పెట్టించుకునేలా చేసిన మహనీయుడు భీమ్ రావు అంబేద్కర్. దళితులు చదవడానికి వీలులేదు పై మూడు వర్ణాల సేవలో వీళ్ళు జీవితాలు తరించాలి వీరి నుదుటిన బ్రహ్మ వ్రాసిన రాత అని చెప్పబడుతున్నా మనుధర్మ శాస్త్రాన్ని, చితి మంటల్లో బూడిద చేసిన పోరాట యోధుడు మన బి.ఆర్ అంబేద్కర్. ప్రపంచం లోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగం ద్వారా మా జీవితాల్లో అక్షర జ్యోతి ని వెలిగించి మాలో ఒక ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ప్రొఫెసర్స్, డాక్టర్స్, ఇంజినీర్స్, లాయర్ లు, టీచర్లు గా తీర్చిదిద్దినా మహనీయుడు బాబాసాహెబ్ అంబేద్కరుడు. దళిత బహుజనుల స్త్రీల సుఖమే కాదు, దేశంలో అందరి సుఖం సంతోషం కోరుకున్నారు. తన జాతి మాత్రమే కాదు దేశంలో ప్రతి మనిషి హక్కులతో బ్రతకాలని రేయింబవళ్ళు పని చేశారు సైడ్డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. 133వ జయంతి సందర్భంగా ఆ మహనీయులకి యావత్తు దేశ ప్రజల పక్షాన అందుకో జోహార్లు.. మా తండ్రి అంబేద్కరా..



– మీసాల ఎల్లేష్
ఎంఏ.డీఈడీ, డిప్లమో
స్పెషల్ ఎడ్యుకేషన్
స్టూడెంట్
దళిత జర్నలిస్టు ఫోరం
గ్రేటర్ హైదరాబాద్
ప్రధాన కార్యదర్శి

# ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై హత్యాయత్నం..

(మొదటి పేజీ తరువాయి..)

కన్ను పైభాగం వాచిపోయింది. బలమైన గాయం కావడంతో రక్తం కారింది. అయినప్పటికీ బాధను పంటి బిగువన భరిస్తూనే సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అభివాదం చేసి.. బస్సుపై నుంచి దిగి లోపలకి వెళ్లారు. డాక్టర్ హరికృష్ణ ఆయనకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం సీఎం జగన్ యధావిధిగా బస్సు యాత్రను కొనసాగించారు. కాగా ఆ వస్తువు పదును, వేగాన్ని బట్టి అది రాయి, గ్రానైట్ పలక, పెల్లెట్, ఎయిర్ బుల్లెట్ ఏదైనా కావచ్చని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం జగన్ ఎడమ కంటి పై భాగాన గాయమయ్యాక.. ఆ పదునైన వస్తువు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌కూ తగలడంతో ఆయనకు కూడా గాయమైంది.

సీఎం వైఎస్ జగన్ షెడ్యూల్ ప్రకారం శనివారం రాత్రి విజయవాడ చేరుకుంటారని ముందే తెలుసుకున్న ఆగంతకుడు ఇందుకు తగ్గట్టే ముందస్తు కుట్ర, ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బస్సు యాత్ర విజయవాడలోకి శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రవేశించింది. బస్సు యాత్ర సాగే మార్గంలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తుండటాన్ని ఆగంతకుడు ఆసరాగా చేసుకున్నాడు. సీఎం జగన్‌ను హత్య చేయాలనే ముందస్తు వ్యూహంలో భాగంగానే సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్‌లోని వివేకానంద స్కూల్ రెండో అంతస్తులో ఓ గదిలో నక్కాడు.దతాము ఉన్న గది కిటీకి తలుపులను తెరిచే ఉంచాడు. రోడ్ షో అక్కడికి చేరుకోగానే సీఎం జగన్ లక్ష్యంగా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అత్యంత వేగంగా దూసుకొచ్చిన పదునైన వస్తువు సీఎం జగన్ ఎడమ కంటి కనుబొమ పైభాగాన తగలడంతో ఆయనకు తీవ్ర గాయమైంది. ఎడమ కన్ను వాచిపోయింది. ఎడమ కంటి కనుబొమ పైభాగాన బలమైన గాయం నుంచి రక్తం కారిపోతున్నా చలించక సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేసి బస్సుపై నుంచి కిందకు దిగి లోపలకి వెళ్లారు. కాగా టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ప్రోద్బలంతోనే సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిందని వైఎస్సార్‌సీపీ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే వీరిద్దరూ తమ మాటల ద్వారా, సోషల్ మీడియా పోస్టుల ద్వారా సీఎం వైఎస్ జగన్‌పై తీవ్ర వ్యతిరేకతను వెళ్లగక్కుతున్నారని గుర్తు చేస్తున్నాయి. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ నవరత్న పథకాలతోపాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారు. కులమతాలు, పార్టీలు, ప్రాంతాలకతీతంగా అర్హతలున్న ప్రతి ఒక్కరికీ ఒక్క రూపాయి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అందించారు. దీంతో మరోమారు సీఎం వైఎస్ జగన్‌కు అధికారం కట్టబెట్టాలని ప్రజలంతా నిర్ణయించుకున్నారు. దీంతో ఒంటరిగా సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేమని టీడీపీ.. జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకుందని వైఎస్సార్‌సీపీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నప్పటికీ టీడీపీకి ఆశాజనకమైన పరిస్థితులు కనిపించకపోవడం, కూటమి నేతలతో కలిసి నిర్వహించిన సభలు విఫలం కావడం, మరోవైపు ముఖ్యమంత్రి జగన్ సభలకు ప్రజలు లక్షల సంఖ్యలో పోటెత్తడం తట్టుకోలేకే ఇలా హత్యాయత్నాలకు చంద్రబాబు, లోకేశ్ పురమాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

యథాతథంగా యాత్ర కొనసాగింపు

తనపై హత్యాయత్నానికి తెగబడినప్పటికీ సీఎం జగన్ ఏమాత్రం వెరవలేదు. వాహనంలోకి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్న వెంటనే ఆయన మళ్లీ వాహనం పైభాగానికి చేరుకున్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ యాత్రను కొనసాగించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు విజయవాడ సింగ్‌నగర్ డాబా కొట్ల జంక్షన్ నుంచి కృష్ణా హోటల్ సెంటర్, పైపుల రోడ్, ప్రకాశ్ నగర్, పాయకాపురం, కండ్రిగ, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి మీదుగా కేసరపల్లి వరకు అంటే 20 కి.మీ. వరకు యాత్రను కొనసాగించారు. శనివారం రాత్రి కేసరపల్లిలో ముందుగా నిర్ణయించిన ప్రదేశంలోనే రాత్రి బస చేశారు.

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స..

సీఎం జగన్‌పై హత్యాయత్నం ఘటన తెలిసిన వెంటనే ఆయన సతీమణి వైఎస్ భారతి కేసరపల్లిలోని రాత్రి బస కేంద్రానికి చేరుకున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స కోసం సీఎం జగన్ తన సతీమణి భారతితో కలిసి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. ప్లాస్టిక్ సర్జరీ, అనస్తీషియా, ఇతర వైద్యుల బృందం పలు వైద్య పరీక్షలు చేసి సీఎం జగన్‌కు చికిత్స అందించారు. ఎడమ కంటి కనుబొమ పైభాగాన లోతైన గాయానికి కుట్లు వేశారు. అనంతరం గాయం మానేంత వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, మందులను ప్రిస్క్రైబ్ చేశారు. సీఎం వద్దకు చేరుకున్న నర్సులు, ఇతర సిబ్బంది 'మీరు జాగ్రత్తగా ఉండండి అన్నా' అంటూ పలకరించారు. ఈ క్రమంలో వారందరినీ సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. ఇక సీఎం జగన్‌తో పాటు దాడిలో గాయపడిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌కు కూడా వైద్యులు చికిత్స చేశారు. సీఎం జగన్‌కు కనుబొమ పైభాగాన లోతైన గాయమైనట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ఆది, సోమవారాల్లో గాయం తగిలిన ప్రాంతంలో వాపు ఉంటే అందుకనుగుణంగా చికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. కాగా ఆస్పత్రిలో సీఎం జగన్ వెంట ఎంపీలు కేశినేని నాని, అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కైలే అనిల్‌కుమార్, మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీలు తలశీల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, దేవినేని అవినాశ్ ఉన్నారు. కాగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం సీఎం జగన్ రాత్రి బసకు తిరిగి కేసరపల్లికి చేరుకున్నారు.

**నేడు యాత్రకు విరామం**

యాత్ర ముగిశాక గాయానికి చికిత్స చేయించుకోవటం కోసం ముఖ్యమంత్రి జగన్ నేరుగా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడకు ఆయన సతీమణి వైఎస్ భారతి కూడా చేరుకుని ఆసుపత్రిలో ఆయనకు తోడుగా ఉన్నారు. వైద్యులు గాయాన్ని పరీక్షించాక, వైఎస్ జగన్‌కు లోకల్ అనస్తీషియా ఇచ్చి... కుట్లు వేశారు. కొంత విశ్రాంతి అవసరమని సూచించారు. చికిత్స అనంతరం జగన్ తిరిగి తన నైట్ హాల్టు ప్రాంతానికి వెళ్లారు. ఆదివారం నాడు బస్సు యాత్రకు విరామంగా ప్రకటించారు. తదుపరి షెడ్యూలును ప్రకటించనున్నారు.

# సీఎం జగన్‌పై పచ్చ గూండాల దాడి పిరికిపంద చర్య

(మొదటి పేజీ తరువాయి..)

నీచుడని తెలియదని ఆయన ఎద్దేవాచేశారు. వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరు సమయమానం పాటించి, మే 13న జరిగే ఎన్నికలలో టిడిపి, జనసేన పార్టీలకు ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. గుర్తు పెట్టుకోండి ఈరోజు మీరు విసిరిని రాయి, రేపు మీ పార్టీకి సమాధి రాయి కాబోతుందని టిడిపి నాయకులను హెచ్చరించారు.



# ప్రజలను ఆదుకోవడంలో కాంగ్రెస్-బీజేపీ విఫలం

(మొదటి పేజీ తరువాయి..)

బీజేపీ చేసిందేమి లేదని.. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయన్నారు. నల్లధనం తెచ్చి పేదల ఖాతాల్లో వేస్తామని మోసం చేశారని.. పేదలకు చేసిందేమీ లేదని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందనన్నారు. మాయ మాటల రఘునందన్ గురించి దుబ్బాక ప్రజలకు తెలుసునన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని, రైతు భరోసా, వడ్లకు రూ.500 బోనస్ ఏమైందని ప్రశ్నించారు. దౌల్తాబాద్‌కు వచ్చేటప్పుడు మిరుదొడ్డిలో మహిళా రైతులతో మాట్లాడానని, వడ్లు ఎవరూ కొనడం లేదని వాపోయారని తెలిపారు. మహాలక్ష్మి ద్వారా రూ.2500, నిరుద్యోగ భృతి కూడా మోసం చేశారన్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏనాడైనా జై తెలంగాణ అన్నారా అని ప్రశ్నించారు. ఎన్నికల హామీలపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కేంద్రంలో పదేళ్లు అధికారం చేపట్టిన బీజేపీ తెలంగాణకు ఏం చేశారని నిలదీశారు. కేసీఆర్ అలుపెరుగని పోరాటంతో, అమరుల త్యాగాలతో తెలంగాణ వచ్చిందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఇప్పటికైనా అమర వీరులకు నివాళులు అర్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత బీజేపీ, కాంగ్రెస్ కలిసిపోయాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని హరీశ్ రావు ఫైర్ అయ్యారు. వడ్లు కొనేవారు లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో తనను చూసే ప్రజలు ఓట్లు వేశారని రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌గా పనిచేసిన పీ వెంకట్రామరెడ్డి అందరికీ సుపరిచితుడేనని, ఇక్కడి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. గతంలో దుబ్బాకలో అనాథలు రాధారాధికలకు అండగా ఉండి.. విద్యాబుద్ధులు చెప్పించి, పెళ్లి కూడా చేసిన మనసున్న వ్యక్తి అన్నారు. ట్రస్టు ద్వారా సేవ చేయడానికి వచ్చిన ఆయనకు అండగా నిలవాలన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థికి ఘన విజయం అందిద్దామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దుబ్బాక అంటే మొదటి నుంచి ఉద్యమ నాయకులు కేసీఆర్, హరీశ్‌రావు అడుగులో అడుగై ముందుకు సాగడం జరిగిందన్నారు. జిల్లా నుంచే కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థికి ఆదరణ కరువైందని, బీజేపీ అభ్యర్థికి ఆ పార్టీ వాళ్లే ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. మాయ మాటలు చెప్పే రఘునందన్‌ను రెండుసార్లు చిత్తు చిత్తుగా ఓడించడం జరిగిందన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు.

# ప్రజలపక్షాన ఆయుధమై ప్రభుత్వంపై పోరాటం

(మొదటి పేజీ తరువాయి..)

తెలంగాణలో ఆ మహానుభావులకు బీఆర్ఎస్ సముచిత స్థానం కల్పించింది. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయానికి ఆయన పేరు పెట్టాం. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి. ప్రజానీకానికి ప్రభుత్వంపై నమ్మకం, విశ్వాసం, గౌరవం ఉండాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు సాధ్యంకాని హామీలిచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తోంది. కానీ గత ప్రభుత్వం సృష్టించిన వనరులను వాడుకునే నైపుణ్యం వారికి లేకుండా పోయింది. మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయి. మంచినీరు దొరకడం లేదు. సాగునీరు అందడం లేదు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు ఉపకార వేతనాలు నిలిచిపోయాయి. దళితవాడలు ధనిక వాడలు కావాలనే సదుద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ రూ.12 లక్షల చొప్పున ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. అది ఇవ్వకపోగా.. 1.36 లక్షల మందికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. కలెక్టర్ల అకౌంట్లలో జమ చేసిన నగదును వాపస్ తీసుకుంది. అర్హులైన దళితులందరికీ వెంటనే దళిత బంధు ఇవ్వాలి. లేదంటే 1.36 లక్షల మంది లబ్ధిదారులతో కలసి సచివాలయం ముందు ధర్నాకు దిగుతా. మౌనంగా ఉంటే సమస్యలు తీరవు. ఎన్నికల ప్రచారం కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నేతలను దళితబంధుపై నిలదీయండి. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల పెళ్లి కోసం ఆర్థిక సాయం చేసే కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేసింది. కాంగ్రెస్ దానికి అదనంగా తులం బంగారం చొప్పున ఇస్తామని మాయమాటలు చెప్పింది. ఏమైంది? ఆడబిడ్డలకు ఇవ్వడానికి కాంగ్రెస్ సర్కారుకు మార్కెట్లో తులం బంగారం దొరకడంలేదా? తెలంగాణలో 11 ఏళ్ల క్రితం దారుణ పరిస్థితి ఉండేది. మేం ఏడాదిన్నర వ్యవధిలో బాగుచేశాం. రైతులు, పరిశ్రమలు, గృహాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేశాం. కేసీఆర్ వెళ్లగానే కరెంటు ఎందుకు రావట్లేదు? ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం కాదా? మిషన్ భగీరథ పథకాన్ని ఐక్యరాజ్యసమితి కూడా అభినందించింది. మరి ఎవరి తెలివి తక్కువతనం వల్ల మంచి నీటి కొరత ఏర్పడింది? ప్రభుత్వ వాగ్దానాలు నెరవేరాలంటే బలమైన ప్రతిపక్షం ఉండాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు 420 వాగ్దానాలు ఇచ్చింది. వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. ఆడబిడ్డలకు స్కూటీలు ఇస్తామని చెప్పింది. స్కూటీలు ఇవ్వకపోగా.. రాష్ట్రంలో లూటీలు మొదలుపెట్టింది. రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీసింది. అనుమతులు నిలిపివేసింది. ఆ రంగంపై ఆధారపడి బతుకుతున్నవారిని రోడ్డు పాలు చేసింది. ప్రభుత్వం యాసంగి పంటను పూర్తిగా కొనుగోలు చేయాలి. వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే.. లేదంటే ఊరుకోబోం. తెలంగాణలో బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి అంకుశం లాంటి ఆయుధాన్ని బీఆర్ఎస్ చేతికి ఇవ్వాలి. అప్పుడే ప్రభుత్వ మెడలు వంచగలుగుతాం. బీఆర్ఎస్ గెలవాలి.. అంకుశంలా పనిచేయాలి. లేదంటే మోసం చేసిన వాళ్ల చేతిలోనే మళ్లీ మోసపోతాం. బీఆర్ఎస్ పుట్టిందే అణగారిన వర్గాల కోసం. అనేక మందిని కాపాడుకున్నాం. కేసీఆర్ బతికున్నంత కాలం పోరాటం చేస్తూనే ఉంటడు.

# చెరువులో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి

నేటి ఫోకస్ న్యూస్, మాక్లూర్:

చెరువులో ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ఒడ్డేట్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహేశ్ (20), తిరుపతి(19), నరేశ్ (20), సాయితేజ, వినోద్‌లు శనివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే చెరువులో మొరం కోసం తవ్విన లోతైన గుంతలు ఉన్నాయి. ఈ విషయం తెలియని మహేశ్, తిరుపతి, నరేశ్ చెరువులోకి దిగిన వెంటనే లోతైన గుంతల్లోకి జారి మునిగి పోయారు. ఒడ్డునే ఉన్న సాయితేజ, వినోద్ వెంటనే తేరుకుని గ్రామంలోనికి వెళ్లి సమాచారం ఇచ్చారు. పెద్దఎత్తున గ్రామస్తులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే ముగ్గురూ మృతిచెందడంతో గజ ఈతగాళ్లతో ముగ్గురి మృత దేహాలను బయటకు తీయించారు. మృతుల తల్లిదండ్రులకు వారు ఒక్కొక్కరే సంతానం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుల్లో తిరుపతి 10వ తరగతి, నరేశ్, మహేశ్‌లు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని ట్రెయినీ ఐపీఎస్ అధికారి చైతన్యరెడ్డి, నార్త్‌జోన్ సీఐ సతీశ్ పరిశీలించారు.

# అమరావతే మన రాజధాని

- హైదరాబాద్‌ను మించి అభివృద్ధి చేస్తా
- ప్రజావేదికతో మొదలైన జగన్ విధ్వంసం
- ఎపిని సర్వనాశనం చేసిన దుర్మార్గుడు
- తాడికొండ ప్రజాగళం సభలో చంద్రబాబు



**నేటి ఫోకస్ న్యూస్, గుంటూరు-ఏప్రిల్13:**

ఎప్పటికీ అమరావతే రాజధాని అని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అమరావతిని నిర్మించి తీరుతామని తెదేపా అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని హైదరాబాద్ ను మించి అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేస్తే జగన్ తుంచారని అన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు తిక్కలోడికి ఓటేస్తే ఏపీకి రాజధాని లేకుండా చేశారని తెదేపా అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తాడికొండలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెయ్యి మంది జగన్‌లు వచ్చినా అమరావతిని అంగుళం కూడా కదల్చలేరన్నారు. అమరావతి రైతులు, మహిళల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. అమరావతి కోసం 29వేల మంది రైతులు 35వేల ఎకరాలు ఇచ్చారు. రాజధానికి కేంద్రం కూడా సహకరించింది. అమరావతిని కూడా హైదరాబాద్‌లా మారుద్దామని ప్రణాళికలు వేశాం. విజయవాడ, గుంటూరుతో కలిపి ఆదర్శ రాజధాని చేయాలనుకున్నాం. ప్రపంచదేశాలన్నీ అమరావతి వైపు చూడాలని ఆలోచించా. సంపద సృష్టించే కేంద్రంగా తయారు చేయాలనుకున్నా. జగన్ వచ్చాక రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని మార్చేశారని మండిపడ్డారు. ఉపాధి కోసం యువత పక్క రాష్ట్రాలకు వెళ్తున్నారు. రాజధాని అంటే పెద్దపెద్ద భవనాలు కాదు.. ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం అన్నారు. అమరావతితో మూడు ముక్కలాట ఆడుతూ తమాషాలు చేస్తున్నారు. అమరావతిని ఎవరూ కూడా ఇక్కడి నుంచి కదల్చలేరు. అసాధ్యాన్ని.. సుసాధ్యం చేయడమే తెలుగుదేశం పార్టీ సత్తా. మన రాజధాని అమరావతే. విశాఖపట్నం, కర్నూలును అభివృద్ధి చేస్తాం. గోదావరి జిల్లాలు గర్జిస్తున్నాయి.. ఆ జిల్లాల్లో వైకాపాకు ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు అమరావతి ప్రజల సంబరాలతో పాటు.. జగనాసుర వధ కూడా జరుగుతుంది. జగన్ పోవాలి.. ప్రజలు గెలవాలని అన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆ పార్టీ నేతలకు కమిషన్లు ఇవ్వలేక రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయి. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను మోసం చేశారు. సీపీఎస్ రద్దు చేస్తామన్నారు.. చేశారా?ఉద్యోగులకు పీఆర్‌సీ, డీఏలు ఇవ్వలేదు. బడికి రంగులు వేస్తే విద్యా వ్యవస్థ మారిపోతుందా? రూ.కోట్లు ఖర్చు పెట్టినా జగన్ సభలకు జనం రావడం లేదు. ఏ ముఖ్యమంత్రి అయినా మంచి పనితో పాలన ప్రారంభిస్తారు. కానీ, రూ. 10కోట్లతో కట్టిన ప్రజావేదిక కూల్చివేసి దుర్మార్గ పాలనకు తెరతీసారు. రాష్ట్రం బాగుపడాలంటే జగన్ దిగిపోవాలి. రాష్ట్ర ప్రజలకు వైకాపాపై కక్ష తీర్చుకునే అవకాశం వచ్చింది. నేను సీఎంగా ఉంటే పోలవరం ఈ పాటికి పూర్తయ్యేది.



# దళితబంధు ఇవ్వకుంటే సచివాలయం ముందు ధర్నా

- లబ్దిదారులతో కలసి తానే ఆందోళనకు దిగుతా
- ఇచ్చిన హామీలపై ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాలి
- మళ్లీ కాంగ్రెస్‌కు ఓటేస్తే ..మోసం చేస్తారు జాగ్రత్త
- ప్రజల పక్షాన పోరాడాలంటే బిఆర్ఎస్ గెలవాలి
- చేవెళ్ల ఎన్నికల ప్రచారంలో కెసిఆర్ పిలుపు

**నేటి ఫోకస్ న్యూస్, చేవెళ్ల-ఏప్రిల్13:**

మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తాము ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దళిత బంధును ఇవ్వకుంటే లబ్దిదారులను తీసుకొచ్చి, సెక్రటేరియట్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర దీక్ష చేపడతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఆ నిధులు విడుదల చేపిస్తా అన్నారు. చేవెళ్లలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సభలో పాల్గొన్న కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ఐక్యరాజ్యసమితి కొనియాడిందన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం తాము తీసుకొచ్చిన పథకాలను వారి రాష్ట్రాల్లో అమలు చేయాలని, ఇక్కడికి వచ్చి పరిశీలించి అభినందించాయని కేసీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు 12 లక్షలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, ఒక్కరికి కూడా ఇవ్వడం లేదన్నారు. ఇప్పుడు కనీసం 10 లక్షలు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల్ని మోసం చేసిందంటూ కేసీఆర్ మండిపడ్డారు. వారికి దళితబంధు నగదు ఇవ్వకపోతే లబ్దిదారులను తీసుకువచ్చి అంబేద్కర్ విగ్రహం దగ్గర దీక్షకు దిగుతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ హెచ్చరించారు. ఉచిత కరెంట్, రైతు బంధు ఇవ్వకున్నా, రైతులకు బోనస్ ఇవ్వకున్నా మాకే ఓటేస్తారు అని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఓటు వేసే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలి. లేకపోతే ఏం చేయకున్నా మమ్మల్ని ఎవరు ఏం అనరు అనే అభిప్రాయం కాంగ్రెస్ పార్టీకి వస్తుంది. తెలంగాణ ప్రజలు తస్మాత్ జాగ్రత్త. ప్రభుత్వం మీకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరాలంటే బలమైన ప్రతిపక్షం ఉండాలి, అందుకే మీరు ఓటు వేసే ముందు ఆలోచించండి, ఆత్మవిమర్శ చేసుకోవాలి. మీకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. అందుకు బిఆర్ఎస్‌ను గెలిపిస్తే ప్రజల పక్షాన పోరాడుతామని అన్నారు. బీసీలకు దమ్ముంటే, బీసీలకు పౌరుషం ఉంటే కాసాని జ్ఞానేశ్వర్‌ని గెలిపించండని కాంగ్రెస్ నేత అన్నారు. అందుకే ఇక్కడున్న బలహీనవర్గాల మేధావులకు, విద్యార్థులకు, ఉద్యోగులకు కాసానిని గెలిపించాలని కేసీఆర్ కోరారు. గెలుపు, బీసీల అభివృద్ధికి మలుపు కాబట్టి కాసానిని గెలిపించి చూపించాలన్నారు. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం.. తెలంగాణ ప్రయోజనాల కోసం అని, ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నాం పోరాటాలు తమకు కొత్త కాదన్నారు. తాను బతికి ఉన్నన్ని రోజులు తెలంగాణ ప్రజల కోసం పోరాడతామన్నారు. 10 ఏళ్లు అధికారం ఇస్తే అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకున్నాం, కానీ నేడు అన్నీ నా కళ్ల ముందే పోతుంటే చూడలేక చాలా బాధ కలుగుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. ఉద్యమంలో మీ దీవెనతో విజృంభించి తెలంగాణ సాధించినం, అవసరమైతే మరో పోరాటా నికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాసానిని గెలిపిస్తే ఎంపీగా చేవెళ్ల ప్రజల పక్షాన పోరాడి నిధులు తెస్తారని ధీమా వ్యక్తం చేశారు.



# మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలి

- ఓటు వేసేటప్పుడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతాం
- 98శాతం హామీలు విస్మరించడంలో ట్రాక్ రికార్డ్
- నేతన్నలకు పంగనామం పెట్టిన ఘనుడు బాబు
- చేనేత చెల్లెమ్మ లావణ్యకు మంగళగిరి టిక్కెట్ ఇచ్చా
- చేనేత కార్మికులతో ముఖాముఖిలో జగన్



**నేటి ఫోకస్ న్యూస్, మంగళగిరి-ఏప్రిల్13:**

ఎన్నికల్లో మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలని వైకాపా అధినేత, సిఎం జగన్ పిలుపునిచ్చారు. 98శాతం హామీలు విస్మరించడం చంద్రబాబు ట్రాక్ రికార్డ్ అని జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఓటు వేసేటప్పుడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతామని సూచించారు. జగన్ మేమంతా సిద్ధం బస్సుయాత్ర మంగళగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా సీఎం జగన్ చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..ఇంటి స్థలాలను ఇవ్వకుండా అడ్డుకున్న చంద్రబాబుని నిలదీయాలన్నారు. ఒక్కరికైనా సెంట్ స్థలం ఇచ్చారా?. మనం స్థలం ఇస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. ఒక్క ఇల్లయినా ఇచ్చారా?. చేనేత కార్మికులకు ఇల్లు, మగ్గం అని చంద్రబాబు మోసం చేశారు. అందుకు భిన్నంగా తాను నేతన్న నేస్తం పథకం కింద రూ.970కోట్లు చేనేత కార్మికులకు అందించాం. మగ్గం ఉన్న ప్రతీ కుటుంబానికి చేయూతనిచ్చిన ప్రభుత్వం మనదన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ది జరిగింది. గతంలో ఎప్పుడైనా ఇలాంటి పథకం అములు చేసిన సందర్భం ఉందా అని ప్రశ్నించారు. . నేతన్నల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.3706 కోట్లు ఖర్చు చేశాం. 1.06లక్షల మందికి లబ్ది జరిగిందన్నారు. గతంలో లంచాలు ఇస్తే కూడా సంక్షేమ పథకం అందని పరిస్థితి ఉండేదన్నారు. దళారులు లేకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాం. నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేసిన ప్రభుత్వం మనది. ఎన్నికల్లో మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలి. 2014 ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చలేదు. వాలంటీర్ వ్యవస్థతో అవ్వాతాతలకు పెన్షన్ అందించిన ప్రభుత్వం మనది. పెన్షన్‌ను రూ.3వేలకు పెంచి అందించే అవకాశం నాకు వచ్చింది. 50 శాతం వెనుకబడిన వర్గాలకు టికెట్ ఇచ్చిన ఘనత మనదే. దేశ రాజకీయ చరిత్రలోనే ఇది ఒక రికార్డు. బీసీలు ఎక్కువగా ఉన్నా.. చంద్రబాబు బీసీలకు సీటు ఇవ్వలేదు. కుప్పంలో కూడా బీసీలే ఎక్కువ.. అక్కడా బీసీలకు టికెట్ ఇవ్వరు. మనం మాత్రం చేనేత వర్గానికి చెందిన చె÷-లలెమ్మెకు టికెట్ ఇచ్చాము. మంగళగిరిలో లక్షా 20వేల ఇళ్లున్నాయి. లక్షా 8వేల ఇళ్లకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాం. 90 శాతం ఇళ్లకు లంచాలకు తావులేకుండా లబ్ది జరిగింది. నేరుగా వారి ఖాతాల్లోనే నగదు జమ చేసిన ప్రభుత్వం మనదని తెలిపారు. రంగురంగుల మేనిఫెస్టోతో వస్తున్న చంద్రబాబు విషయం జాగ్రత్తగా ఉండాలన్నారు. సూపర్ సిక్స్, సెవెన్ అంటూ వస్తున్న చంద్రబాబు గతంలో చేసిన అన్యాయాన్ని గుర్తుచేసుకోవాలని సూచించారు. గత చంద్రబాబు పాలనను మీరు చూశారు. 58 నెలల కాలంలో మీ బిడ్డ పాలనను చూశారు. ప్రతీ పేదవాడి గుండెల్లో నిలిచేలా మీ బిడ్డ అడుగులు వేశాడు. 58 నెలల పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజల నుంచి వింటున్నాను. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలకు సూచనలు తీసుకుంటున్నాను. చంద్రబాబుకు ఉన్నంత నెగిటివిటీ అనుభవం నాకు లేదన్నారు. చేనేత కార్మికులను కూడా చంద్రబాబు మోసం చేశాడు. 2014లో కూటమిగా వచ్చి చంద్రబాబు ఏం చేప్పారో గుర్తు చేసుకోండి. ఓటు వేసేటప్పుడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతాం. గతంలో 98 శాతం హామీలను ఎగ్గొట్టారు. 2 శాతం హామీలను మాత్రమే నెరవేర్చారు. గత పాలనకు, మన పాలనకు తేడాను మీరే గమనించారు. చంద్రబాబు రంగురంగుల మేనిఫెస్టోతో వస్తున్నారు. సూపర్ సిక్స్, సెవెన్ అంటూ వస్తున్నారు. గతంలో కూడా ముగ్గురు కలిసే వచ్చారని విమర్శించారు. మంగళగిరిలో చేనేతలు ఎక్కువ.. అందుకే ఆర్కేతో మాట్లాడి చేనేత కుటుంబానికి చెందిన నా చెల్లెమ్మ మురుగుడు లావణ్యకి టికెట్

ఇచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మరో వైపు చంద్రబాబు ఆయన కొడుకు ఏం చేస్తున్నారు. బీసీలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో వాళ్లే నిలబడి కోట్లకి కోట్లు డబ్బు ఖర్చు చేస్తున్నారని అంటూ దుయ్యబట్టారు. కుప్పంలోనూ బీసీలు ఎక్కువగా ఉన్నా అక్కడ కూడా ఇదే పరిస్థితి. తేడా గమనించమని కోరుతున్నానని సీఎం జగన్ తెలిపారు. గత పాలనకు, మన పాలనకు తేడాను మీరే గమనించారు. చంద్రబాబు రంగురంగుల మేనిఫెస్టోతో వస్తున్నారు. సూపర్ సిక్స్, సెవెన్ అంటూ వస్తున్నారు. గతంలో కూడా ముగ్గురు కలిసే వస్తున్నారని సీఎం జగన్ వివరించారు.

## తాగునీటికి ఇబ్బందులు లేకుండా

# ప్రణాళికా బద్దంగా చర్యలు

### – పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్13:**

తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికా బద్దంగా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. శనివారం వికారాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా తాండూరు సమీపంలోని కాగ్నా నది నుండి త్రాగు నీరు అందించే పంప్ హౌస్ ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, మిషన్ భగీరథ ఉన్నతాధికారులతో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. ఈ సందర్భంగా పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ%ాా% ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైనదని, దీనిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యతనిస్తూ అనునిత్యం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలతో అధికారులు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించడం జరుగుతుందని ఆయన అన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టిలను ఏర్పాటు చేసేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. కాగ్న నది ఇంటెక్ వెల్ నుండి కొడంగల్, యాలాల మండలంలోని గ్రామాలకు మంచి నీరు 2.5 ఎంఎల్డి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. నీటి స్వచ్ఛతను తెలుసుకోవడానికి వీలుగా ప్రతి గ్రామ పంచాయతీకి క్లోరోస్కోప్ కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 కోట్ల నిధులతో 19,605 చేతిపంపులు, 14708 సింగల్ ఫేస్ , 5 హెచ్పి పంపుసెట్లు, 605 మంచినీటి బావులు, 662 కిలోమీటర్ల ఇంట్రా పైప్ లైన్ మరమ్మతులు స్పెషల్ డ్రైవ్ కింద అవును నువ్వు చెప్పడానికి జరిగిందని ఆయన అన్నారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాకు 3.54 కోట్ల నిధులను మంజూరు చేయగా ఈ నిధులతో 1044 పంపు సెట్లు 495 చేతిపంపులకు మరమ్మత్తులు చేయించామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23975 గ్రామాలకు 37002 ఓహెచ్ఎస్ఆర్ ల ద్వారా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ మంచినీటిని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి పది రోజులకు ఒకసారి ఓహెచ్ఎస్ఆర్ క్లోరినేషన్ చేసి పరిశుద్ధమైన మంచినీటిని ప్రజలకు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. తదనంతరం పరిగి మండలం రాఘవపూర్ 135 ఎమ్.ఎల్.డి నీ సందర్శించి ఏఏ గ్రామాలకు త్రాగునీరు చేరుతున్న విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.



## షకీల్ కొడుకు రాహిల్‌కు బెయిల్

**నాటి పోలీసుల తీరుపై దర్యాప్తు**

**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు కేసులో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. రాహిల్‌కు మంజూరు చేసింది. అయితే, రాహిల్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో జూబ్లీహిల్స్‌లో 2022లో జరిగిన రోడ్డు ప్రమాదం కేసును కూడా రీ ఓపెన్ చేయనున్నారు. ఈ కేసు దర్యాప్తు చేసిన అప్పటి పోలీసు అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పంజాగుట్ట కేసుమాదిరిగానే.. జూబ్లీహిల్స్ కేసులోనూ రాహిల్‌ను తప్పించారు అప్పటి పోలీసులు. తనకు బదులుగా వేరే వ్యక్తిని డ్రైవర్‌గా పంపించాడు రాహిల్. ఇప్పటికే ఈ కేసులో చార్జిషీట్ సైతం దాఖలు చేశారు పోలీసులు. చార్జిషీట్లోనూ రాహిల్‌ను తప్పించే ప్రయత్నం చేశారు అప్పటి జూబ్లీహిల్స్ పోలీసులు. 2022 మార్చ్‌లో జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో కారు ప్రమాదం జరిగింది. ఈ ఘోర ప్రమాదంలో నెలల వయసున్న చిన్నారి ప్రాణాలు కోల్పోగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కేసు రీ ఓపెన్ చేశాక బాధితుల స్టేట్‌మెంట్‌ను పోలీసులు మరోసారి రికార్డ్ చేశారు. ఈ కేసు విచారణలో రాహిలే ప్రమాదానికి కారణం అని తేల్చారు. అయితే, జూబ్లీహిల్స్ కేసులో రాహిల్‌ను తప్పించిన అప్పటి పోలీసులపై చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మరి పోలీసులు ఈ వ్యవహారంలో ఎలాంటి స్పెట్ తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

## ఖాళీ స్థలంపై మహిళతో ఘర్షణ

**మహిళను మంటల్లోకి నెట్టిన వైపిసి నేత**

**విశాఖపట్టణం, నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

ఖాళీ స్థలం విషయంలో వైసిపి నాయకుడికి, స్థానిక మహిళకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వైసిపి నేత సదరు మహిళను మంటల్లోకి నెట్టేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. ఈ ఘటన విశాఖ గాజువాకలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాజువాక 65వ వార్డు బానోజితోటలో రాధ (35) నివాసం ఉంటోంది. ఆమె ఇంటి పక్కన కొంత ఖాళీ స్థలం ఉండగా.. శుక్రవారం వైసిపి నాయకుడు లోకనాథం అక్కడ చెట్లు నరికి అగ్గి పెట్టాడు. దీంతో రాధ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ స్థలం తన దని.. ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ అతడిని నిలదీసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో లోకనాథం ఆమెపై చేయి చేసుకున్నాడు. చెట్టు కాలుతున్న మంట ల్లోకి తోసేయడంతో ఆమె చేతులు, ముఖానికి గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితురాలు న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం రాధ కేజీహెచ్‌లో చికిత్స పొందు తోంది. మరోవైపు లోకనాథం తాను ఆ సమయంలో సంఘటనా స్థలంలో లేనని చెబుతు న్నాడు. కొద్దిరోజులుగా ఆమె తనపై కక్ష పెట్టుకుని ఫిర్యాదు చేస్తోందని ఆరోపించాడు. దీనిపై సీఐను సంప్రదించగా.. ఫిర్యాదు అందిందని, విచారణ చేపట్టినట్లు చెప్పారు. ఖాళీ స్థలంపై గత కొన్నాళ్లుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నట్లు సమాచారం.

## దైవదర్శనానికి వెళ్లిన వ్యాపారి ఇంటికి కన్నం

**బంగారం, నగదు దోచుకున్న దొంగలు**

**రంగారెడ్డి, నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

ఓ వ్యాపారి కుటుంబీకులు అంతా ఎంతో ఉత్సాహంగా దైవదర్శనానికి వెళ్లారు. తమ ఇష్టదైవాన్ని దర్శించుకుని ఆనందంగా ఇంటికి తిరుగుపయనమయ్యారు. అయితే ఇంటికి వచ్చిన చూసిన ఆ కుటుంబీకులకు మాత్రం పెద్ద షాకే తగిలింది. దొంగలు ఉన్నదంతా దోచుకున్నారు. దీంతో యజమానులు లబోదిబోమని మొత్తుకున్నారు. జిల్లాలోని రాజేంద్రనగర్ దొంగలు రెచ్చిపోయారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్ చేసిన దుండగులు.. అదును చూసి ఇళ్లను గుల్ల చేశారు. రాజేంద్రనగర్ బండ్లగూడ వికాస్ నగర్‌కాలనీలో ఓ ఇంటి తాళాలు పగలగొట్టి మరీ దుండగులు చోరీకి తెగబట్టారు. నవీన్ అనే వ్యాపారి ఇంట్లో ఉన్న 12 తులాల బంగారం, వెండి ఆభరణాలలతో పాటు రూ.25 వేల నగదును దుండగులు దోచుకెళ్లారు. వ్యాపారి కుటుంబం ఇంటికి తాళం వేసి దైవ దర్శనం నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి చేరుకున్న నవీన్.. డోర్ ధ్వంసం చేసి ఉండడాన్ని గుర్తించాడు. వేసిన తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు వ్యాపారి సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్స్ బృందాలు రంగంలోకి దిగాయి. పలు ఆధారాలను కాప్స్ సేకరించారు. తాళం వేసిన ఇల్లు టా÷-గ్గ్ం÷ట్ చేసి మరీ దుండగులు చోరీకి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం

**పంట దెబ్బతిందని అన్నదాతల ఆందోళన**

**నిజామాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీచాయి. ఉదయం నుంచి జిల్లా అంతటా వర్షం పడింది. అయితే అకాల వర్షాల వర్షంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటకు నష్టం కలిగిందని వాపోయారు. బాన్సువాడ, బీర్కూరు మండల కేంద్రంలోని మార్కెట్‌లో రైతులు పంటను ఆరబెట్టగా వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. అకాల వర్షాలతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిముద్దయింది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఆందోళ చెందుకున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతలను ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాగా, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కూడా శనివారం ఉదయం వర్షం కురిసింది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

హైదరాబాద్ నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గుర్రంగూడ ఎక్స్ రోడ్డు వద్ద వేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పింది. దీంతో ఆగి ఉన్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తేల్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందా ?

- **పొత్తులో భాగంగా బిజెపికి మద్దతుగా నిలుస్తుందా**
- **తెలంగాణ జనసేన నేతల్లో కానరాని స్పష్టత**

**విజయవాడ, నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

ఎపిలో పొత్తులో ఉన్న జనసేన తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తుందా లేకపోతే...బిజెపికి మద్దుతగా నిలుస్తుందా అన్నది తెలియాల్సి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసి బొక్కబోర్లా పడింది. తెలంగాణ లోక్ సభ ఎన్నికలకు సంబంధించి జనసేనాని పవన్ కళ్యాణ్ సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ఎన్నికల బరిలో దిగుతున్నాయి. పొత్తులో భాగంగా జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తోంది. అయితే జనసేన టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పి వైసీపీలోకి క్యూ కట్టారు. జనసేన నేతలకు టికెట్లు ఇవ్వలేదనే బాధ కంటే కూడా.. పక్క పార్టీల నుంచి పిలిచి మరి టికెట్ ఇవ్వడంపై మండిపడుతున్నారు. ఇప్పటికే పోతిన మహేష్, మనుక్రాంత్ రెడ్డి, పితాని బాలకృష్ణ, పాముల రాజేశ్వరి సహా పలువురు నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పారు. మరికొందరు అదే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వరుసగా నేతలు పార్టీని వీడుతుండడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ అలర్టయ్యారు. మొన్నటి వరకు అసంతృప్తులపై కన్నెత్తి కూడా చూడని పవన్ కల్యాణ్ ఇప్పుడు వారిని బుజ్జగించే పనిలో పడ్డారు. టికెట్లు దక్కని సీనియర్లలో కొంతమందికి జిల్లా ఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు అప్పగిస్తూ.. మరికొంతమందికి పార్టీ ఏర్పాటు చేసిన కమిటీలో అవకాశాలు ఇచ్చి వారిని బుజ్జగిస్తున్నారు. తిరుపతి టికెట్ అరణి శ్రీనివాసులుకు కేటాయించడంతో జనసేనలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. జనసేన తిరుపతి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న కిరణ్ రాయల్ సీటు ఆశించారు. కానీ వైసీపీ నుంచి వచ్చిన అరణి శ్రీనివాసులుకి టికెట్ కేటాయించడంతో అసంతృప్తిగా ఉన్నారు. ఇప్పటికే ప్రచారంలో శ్రీనివాసులకి అటు జనసేన నుంచి, ఇటు టీడీపీ



నుంచి సహకారం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో తిరుపతి వెళ్లిన పవన్ కల్యాణ్ కూటమి నేతలతో సమావేశమయ్యారు. టీడీపీ అసమ్మతి నేతలతోనూ పవన్ మాట్లాడారు. తిరుపతి జనసేన అభ్యర్థిపై నిర్ణయం చంద్రబాబుతో కలిసి తీసుకున్నామని వారికి వివరించారు. జనసేన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల కోసం సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు పవన్ కల్యాణ్. బొంగునూరి మహేందర్‌రెడ్డి సమన్వయకర్తగా, శంకర్‌గౌడ్, రాజలింగం, పొన్నూరి శిరీష, ప్రేమ్‌కుమార్, ములుకుంట్ల సాగర్ సభ్యులుగా ఉంటారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తులో భాగంగా 7 స్థానాల్లో పోటీ చేసిన జనసేన ఆశించినంతమేర సక్సెస్ కాలేదు. మరి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి తెలంగాణలో ఖాతా ఓపెన్ చేస్తుందా అనేది వేచి చూడాలి. అయితే ఇప్పటి వరకు 17 లోక్ సభ స్థానాలకుగాను ఒక్క నియోజకవర్గానికి కూడా అభ్యర్థులను ప్రకటించలేదు జనసేన. అయితే నామినేషన్ పక్రియకు కేవలం ఐదు రోజుల ముందు ఈ సమావేశం ఏర్పాటు చేయడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రత్యక్షంగా పోటీ చేస్తారా లేక గతంలో లాగా ఇతర పార్టీలకు మద్దతు ఇస్తారా అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

# దళిత జనోద్ధరణకు రామానుజుల శ్రీకారం

- **సంస్కరణ వాది ఆచార్య రామానుజులు**
- **ఆళ్వారుల్లో దళితలకు పెద్దపీట**

**హైదరాబాద్-నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

ఇటీవల హైదరాబాద్ ముచ్చింతల్‌లో సమతామూర్తి రామానుజల విగ్రహావిష్కరణతో ఆయన గొప్పతనమేంటో ప్రపంచానికి తెలిసే అవకాశం వచ్చింది. నిజానికి తమిళనాట అప్పట్లో కులాచారాలు బలంగా ఉండేవి. ఆ కాలంలోనే దళితజనోద్ధరణకు రామానుజులు విశేషంగా కృషి చేశారు. చాపకూడు సహా దళితులను ఆళ్వారులుగా స్వీకరించి వారికి మంత్రోపదేశం ఇచ్చారు. అలా చేరిన వారిలో అగ్రగణ్యులు దళితులే. ఇలా రామానుజా చార్యుల వారు ఆనాడే సంఘసంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఎప్పుడూ విభిన్నంగా ఆలోచించే ఆయన ఓ రకంగా సంస్కరణ వాది. ఆనాడే అస్పృశ్యతను వ్యతిరేకించారు. ఆయన నిర్మించిన ఆచార్య పరంపరలో దళితులుకూడా ఉన్నారు. చాపకూడు అంటే సహపంక్తి భోజనాన్ని ఆనాడే ఏర్పాటు చేసి ఆచరించి చూపారు. నేర్చుకోవాలన్న తపన ఉన్నవారు ఎవరైనా కులాలకు అతీతంగా ఆహ్వానించారు. అలా వచ్చిన వారు ఎందరో ఆయన శిష్యగణంగా ఉండిపోయారు. ఆకాలంలో ఆడవారికి, బ్రాహ్మణేతరులకి ఉపదేశం అనేదే లేదు. విలువైన మంత్రాలను ఇతరకుల ఉపదేశించకుండా ఉంటే, విలువైనవి మన వద్ద ఉండి కూడా నష్టం ఎందుకు పొందాలి అని రామానుజాచార్యుల వారు ఆనాడే



ఆలోచన చేశారు. రుచి ఉన్న వారికి, మేము కూడా బాగుపడతాం, నాకూ తెల్సుకోవాలని ఉంది అనే వారందరికీ అందించాలి అని ఆచార్య పరంపర ఏర్పాటు చేసారు. అలా ఆయన సంస్కరణలకు శ్రీకరాం చుట్టారు. తనవరకు తీసుకుంటే సుమారు 40 సంవత్సరాలు దాటి, సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన జ్ఞాని అయి ఉన్నప్పటికీ చరమ శ్లోకలో ఉన్న గంభీరమైన తాత్పర్యాన్ని తెలుసుకోవడానికి 300 మైళ్ల దూరంలో ఉన్న ఆచార్యుడి వద్దకి నడిచి 18 సార్లు వెళ్తే కానీ అవకాశం లభించలేదు. నాలాంటికే అంత కష్టంగా లభిస్తే సామాన్యులకు మంత్ర ఉపదేశం జరిగే ప్రశ్నే రాదు. అందుకే రామానుజాచార్యుల వారు ఇంత కష్టంగా ఉన్నా మనకే లభించకపోతే మనకు జరిగే నష్టం ఏంతో కదా అని ఆలోచన చేశారు. అట్లా అష్టాక్షరీ, ద్వయ మంత్రం, చరమ శ్లోకాన్ని ఒకేసారి ఉపదేశంగా అందేట్టు చేసారు. రామానుజులకు ముందు ఈ మూడు మంత్రాలు ఒకే సారి ఉపదేశం చేసేవారే కాదు. మంత్రం, మంత్రార్థం కూడా ఒకేసారి లభించేది కాదు. మరిలా అందరికీ చెబితే దాని విలువ పోదా అంటే, మనిషికి ఒకసారి అంటూ సంస్కారం ఏర్పడితే, లోన నిలిచి పోతుంది, క్రమేపి మనపై ప్రభావం చూపుతుంది. మానవ దేహం అనేది సులభంగా లభించలేదు. ఎన్నో జన్మల క్లేషాల తర్వాత వచ్చింది. ఈ మానవ శరీరం అనేది మెరుపు తీగ పాటి అంత కూడా లేదు అని చెబుతారు అళ్వార్లు. అందుకే సంస్కారం అంటూ ఎర్పడితే మానవ జన్మ కంటే క్రిందకి దిగజార కుండా ఉంటుంది. క్రమేపి బాగుపడే అవకాశం ఉందన్నది రామానుజాచార్యులవారు. ఆశించారు. అది మన పరంపర. రామానుజాచార్యుల నిర్హేతుక కృప వల్ల మనం ఈనాడు ఆ పరంపరని అనుభవిస్తున్నాం.

# ధాన్యం సేకరణలో శ్రద్దలేని సిఎం రేవంత్

- **తెలంగాణలో రూ. 1450 కోట్ల వడ్ల కుంభకోణం**
- **బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి**

**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన సేకరణ మీద ఉన్నంత ధ్యాస.. ధాన్యం సేకరణ మీద లేదు అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. రూ. 1450 కోట్ల వడ్ల కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఐఎన్‌సీ అంటే ఇండియన్ నేషనల్ కరప్షన్ పార్టీ అని జీవన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డిది స్కీమ్‌ల పాలన కాదు అని స్కామ్‌ల పాలన అని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ 7,429 కొనుగోలు కేంద్రాలు పెడితే.. ఇప్పుడు రేవంత్ రెడ్డి 5 వేల దాకా మాత్రమే పెట్టారు. దీంతో రైతులు ఆగమై పోతున్నారు. ధన సేకరణ మీద పెట్టిన దృష్టి ధాన్యం సేకరణ మీద కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టడం లేదు.



కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ. ఫాదర్ ఆఫ్ ద కరప్షన్ పార్టీ ఏదంటే అది కాంగ్రెస్ పార్టీనే అని జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి 420 స్కీములు డిసెంబర్ 9 కే ఇస్తామని చెప్పి డైవర్ట్ చేస్తున్నాడు. ఇప్పుడు ఇంకో 25 పథకాలు ఇస్తామని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ పథకాలు మరిచిపోయేలా రేవంత్ చేష్టలు ఉన్నాయి. రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి పేరిట ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో 1450 కోట్ల వడ్ల కుంభకోణం జరిగింది. 35 లక్షల మెట్రిక్ టన్నులు అమ్ముకున్నారు. రూ. 2183 మద్దతు ధర ఉంటే రూ. 1900 కే అమ్మారు. ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరకు అమ్మారు. ఈ గ్లోబల్ టెండర్లు ఆంధ్రవాళ్లకు వచ్చినయి. ఈ గ్లోబల్ టెండర్లలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల వాటా ఎంతో చెప్పాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ వడ్ల స్కామ్ మీద సీబీఐ, ఈడీ సుమోటోగా కేసు నమోదు చేసి ఎంక్వయిరీ వేయాలన్నారు జీవన్ రెడ్డి. దీని మీద మేం కూడా సీబీఐ ,ఈడీకి లెటర్ రాస్తామన్నారు. బీజేపీ కూడా దీని మీద నోరు మెదపడం లేదు బీజేపీ వాళ్ళ వాటా కూడా ఎంతో చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఊరిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వడ్లు కొన్నాం. కానీ రేవంత్ రెడ్డి రౌడీయిజం చేస్తున్నారు. ఈ రాష్ట్రంలో, దేశంలో అప్రకటిత ఎమ్జ్గం÷న్సీ కొనసాగుతోంది. హస్తం అంటే అవినీతి నేస్తం అని జీవన్ రెడ్డి మండిపడ్డారు. చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విరుచుకుపడ్డారు. రంజిత్ రెడ్డి చప్రాసీ ఉద్యోగానికి కూడా పనికిరాడు అని తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రంజిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఏం తక్కువ చేసింది. కోళ్లు, గుడ్లు అమ్ముకునే రంజిత్ రెడ్డిని తీసుకొచ్చి ఎంపీని చేశారు కేసీఆర్. ఆయన జీవితంలో చప్రాసీ కూడా కాలేదు. ఆ ఉద్యోగానికి కూడా పనికిరాడు. నువ్వే నా గురువు, నువ్వే నా ఫాదర్ అని రోజు కేసీఆర్‌కు చెప్పేవాడు. నా కన్న తండ్రి కంటే కేసీఆరే గొప్ప అని చెప్పాడు. అక్రమాస్తులను కాపాడుకునేందుకే రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. విశ్వాస ఘాతకుడు రంజిత్ రెడ్డి. ఈయన డాక్టర్ రంజిత్ రెడ్డి కాదు.. కోళ్లకు సూదులిచ్చే డాక్టర్ రంజిత్ రెడ్డి. కోళ్ల దాణా అమ్మి.. 300 ఎకరాల భూములు గుంజుకున్నాడు. చాలా మందిని మోసం చేసిండు.. ఆ జాబితా కూడా త్వరలోనే బయటపెడుతాను. చేవేళ్ల ఆయన ఊరు కాదు. కరీంనగర్‌లో పుట్టిండు.. వరంగల్‌లో బతికిండు. హైదరాబాద్‌లో కోళ్ల దుకాణం పెట్టాడు. ఆయనకున్న ఆస్తులను అఫిడవిట్‌లో పొందుపరచలేదు. కేసులు పెడుతారని భయపడి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఇవాళ ఎలాగైతే కేసీఆర్‌ను మోసం చేసిండో.. రేపు రేవంత్‌ను కూడా అలాగే మోసం చేస్తాడు అని జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు.

# తిరుమల పవిత్రతను మంటగలిపిన ప్రభుత్వం

**కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సరిదిద్దుతాం**
**తిరుపతి నాయకులతో పవన్ ఆవేదన**

**అమరావతి, నేటి ఫోకస్ న్యూస్-ఏప్రిల్13:**

తిరుమల క్షేత్ర పవిత్రతను అధికార వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, కోరి తెచ్చుకున్న అధికారులు మంటగలిపేసిన తీరు భక్తులను మనోవేదనకు గురి చేసిందని, కూటమి ప్రభుత్వంలో కచ్చితంగా ధర్మ పరిరక్షణకు నడుం బిగించాల్సిన అవసరం ఉందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులను సైతం అడ్డగోలుగా వాడుకునే కుట్రలకు అధికార పార్టీ నాయకులు తెర తీసిన విషయంపై సమగ్ర సమాచారం పార్టీ దగ్గర ఉందన్నారు. తిరుపతిలో బీజేపీ నేతలతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు అనుసరించాలని వ్యూహాలు, తిరుపతి అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు ఆయనను కలిశారు. జనసేన పార్టీ శ్రేణులు, నాయకులకు దిశానిర్దేశర చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీ చేసిన అక్రమాలు, దౌర్జన్యాలను ఈసారి సార్వత్రిక ఎన్నికల్లోనూ చేస్తుందని.. దాన్ని మూడు పార్టీలూ సమర్థవంతంగా ఎదుర్కోవడంపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఇంతకు ముందు సైతం చర్చల్లో బోగస్, దొంగ ఓట్లుపై చర్చ జరిగిందన్నారు. దీనిపై కచ్చితంగా కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. బూత్ స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు అప్రమత్తంగా వ్యవహరించి దొంగ ఓట్లను అడ్డుకోవడం అత్యవసరమన్నారు. ఈ విషయంలో మూడు పార్టీలు ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పని చేయాలన్నారు. తులసి వనం లాంటి తిరుపతిని గంజాయి వనం చేసేసిన వైఎస్సార్‌సీపీని సాగనంపాల్సిన సమయం వచ్చేసిందని.. ఇదే పరిస్థితి రాష్ట్రం అంతటా ఉందన్నారు. అరాచకాలను, అవినీతికి, గూండాయిజానికీ ప్రతివర్గం నలిగిపోయిందన్నారు. రైతులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, పెన్షనర్లు, వృద్ధులు, మహిళలు, ఎస్సీ,



ఎస్టీ, బీసీ ఇలా ప్రతి వర్గం వైఎస్సార్‌సీపీతో బాధలు పడుతోందని.. పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలు బెంబేలెత్తిపోయారన్నారు. రాబోయేది కూటమి ప్రభుత్వమే. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని బలంగా ఎదుర్కోగలిగేది కూటమి పార్టీలేనని ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు.